# అష్టావక్రుడు

అష్టావక్రుడి కథ విష్ణు పురాణంలో చెప్పబడింది అని పెద్దలు చెప్పగా విన్నాను. అష్టావక్రుడి తల్లిదండ్రులు ఉద్దాలక మహర్షి చెల్లెలు అయిన సుజాత, మరియు ఏకపాద మహర్షి.

ఏకపాద మహర్షుల వారు చాలా మంది శిష్యులకి విద్యాబోధ చేస్తూ ఉండేవారు. ఐతే వారు బాగా విజ్ఞానవంతులు కావాలి అని కొంచెం కఠినంగా ఉండేవాడు అన్న మాట. మధ్య మధ్యలో శిక్షగా శిష్యులని విరామం లేకుండా చదివిస్తూ ఉండేవాడు.

ఒక రోజు, సుజాత ఏకపాదులు భోజనం చేసి విశ్రాంతిగా కూర్చుని మాట్లాడుకుంటూ ఉండగా సుజాత గర్భస్థ శిశువు ఏకపాదుడితో " మీరు శిష్యులని విరామం లేకుండా చదివించడం వల్ల, వారికి అన్నపానాదులు మరియు విశ్రాంతి కరువై చాలా బాధ పడుతున్నారు" అని అన్నాడు. అది విన్న ఏకపాదుడికి సర్రున కోపం వచ్చి "నాకే బుద్ధులు చెపుతావా ? నువ్వు అష్టవంకరలతో జన్మించు గాక" అని శపించాడు.

ఆ రోజుల్లో వరుణ పుత్రుడు అయిన వంది అనే వాడు తనను శాస్త్ర వాదంలో గెలిచేవాడు లేడు అని విఱ్ఱవీగుతూ, తనను గెలిచిన వాడికి అపార ధన రాశులు ఇస్తానని, ఓడిపోతే తనతో వాదించి ఓడిపోయిన పండితులని తన గృహంలో జలదిగ్బంధంలో ఉంచుతానని చాటింపు వేయించాడు.అలా చాలా మంది పండితులు ధనం కోసం ఆశపడి వెళ్ళి వంది - వరుణుడి గృహంలో జల బందీలు అయిపోయారు.


మాగంటి వంశీ మోహన్ www.maganti.org contact@maganti.org
PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఇది విన్న ఏకపాదుడు వందిని ఓడించి అతని నుంచి ధనం తెచ్చుకోవాలి అని బయలుదేరి వెళ్ళి, అక్కడి వాదంలో ఓడిపోయాడు. ఇంకేముంది వంది, ఏకపాదుడిని జలదిగ్బంధంలో పడేసాడు.

సరే ఆ సంగతి అలా ఉండగా ఇక్కడ సుజాత అష్టావక్రుడికి జన్మనిచ్చింది. మేనమామ ఉద్దాలకుడినే తన తండ్రిగా భావించేవాడు అష్టావక్రుడు. ఉద్దాలకుడికి ఒక కుమారుడు ఉండేవాడు. అతని పేరు అశ్వకేతు.

ఈ అశ్వకేతు ఒక రోజు చిన్నతనం వల్ల తెలీక, తన తండ్రి ఉద్దాలకుడి ఒళ్ళో కూర్చుని ఉన్న అష్టావక్రుడిని కిందకి తోసేసి, "మా నాన్న ఒళ్ళో ఎందుకు కూర్చున్నావు - పోయి మీ నాన్న ఒళ్ళో కూర్చో పో" అన్నాడు. అష్టావక్రుడు ఏడుస్తూ పోయి తన తల్లి సుజాతని "అమ్మా, నాకు నాన్న ఎవరు" అని అడిగాడు. సుజాత, ఏకపాదుడు - వంది వృత్తాంతం చెప్పింది.

అప్పుడు అష్టావక్రుడు జనకరాజ సభకి వెళ్ళి, వందితో శాస్త్రసంవాదంచేసి అతని ఓడించాడు. వంది సిగ్గుతో చితికిపోయి అపారమయిన ధనంతో పాటు నీకు ఇంకా ఏమి కావాలో కోరుకో అని అడగగా, జలదిగ్బంధంలో ఉన్న తన తండ్రి సహా అందరినీ విడిచిపెట్టు అని కోరి, తన తండ్రి ఏకపాదుడిని తీసుకుని తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

అదీ పిల్లలూ మన అష్టావక్రుల వారి కథ

Keywords: ashTAvakruDu, EkapAda maharshi, sujAta, uddAlaka maharshi, aSwakEtu, vishNu purANam, vandi, varuNuDu, jala digbandhanam



PDF created with pdfFactory trial version www.pdffactory.com